# 16

# “వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి”

## (5:7-14)

4 మొదలుకొని 6 వరకు గల అధ్యాయాల్లో మూడవ సారిగా, వారు ఒక నిర్దిష్టమైన విధానములో “నడుచుకొనవలెను” అని పౌలు ఎఫెసీయులకు 5:7–14లో ఆదేశమిలిచ్చుచున్నాడు. క్రైస్తవుడు ప్రేమ కలిగి నడుచుకొనవలెనని ఆయన చేయుచుండిన చర్చను తరువాతి భాగమును పరిచయము చేయుచున్న ఒక తుది అభిప్రాయముతో ముగించాడు. క్రైస్తవ్యమునకును ఎఫెసీయుల పూర్వ జీవిత విధానములకును గల తారతమ్యమును పోల్చుచు, వారు అంధకారములో నుండి బయటికి వచ్చి వెలుగు పిల్లలవలె నడుచుకొనవలెనని వారిని సవాలు చేసాడు.

### వెలుగు ఫలము ఫలించవలెను (5:7–10)

**[7]గనుక మీరు అట్టివారితో పాలివారై యుండకుడి. [8]మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు. [9]వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది. [10]గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి.**

**వచనము 7.** ఈ వచనము, **గనుక** అను జోడింపు పదముతో, ఈ వచనములోని మొదటి సగభాగమునకు సంబంధించినదే అని స్పష్టమగుచున్నది. ఏదిఏమైనా, NASB అనువాదకులు దీనితో ఒక క్రొత్త వాక్యమును మొదలుపెట్టారు, గనుక ఆ వాక్యము 10వ వచనము వరకు కొనసాగుచున్నది. లైంగిక సంబంధమైన పాపములలో మునిగి తేలియాడువారిపై దేవుని ఉగ్రత కుమ్మరింపబడినందు వలన, వారు ఎవరై యుండిరో గుర్తుంచుకొనవలెనని పౌలు ఎఫెసీయులను హెచ్చరించుచుండెను. వారు ఇతరులను ప్రేమించుట ద్వారా దేవుని మరియు క్రీస్తును అనుకరింపవలెనని ఆయన వారికి సెలవిచ్చాడు. ఈ ఆదేశము తరువాత, **మీరు అట్టివారితో పాలివారై యుండకుడి** అని చెప్పుచున్నాడు.

> ఇచ్చటి అసలు విషయము, అన్యజనుల ప్రపంచములోని జీవితము యొక్క సమస్త కోణాల నుండి సాధారణంగా దూరంగా ఉండుట గూర్చిన ఒక విషయం కాదు కానీ నిర్దిష్టముగా అనైతిక కోణాల నుండి చేసుకొనబడిన ఒక వేర్పాటుకు సంబంధించినదై యున్నదని ఎఫెసీ పత్రికలోని ఇచ్చటి సందర్భము స్పష్టము గావించుచున్నది. చదువరులు అవిధేయులైన అన్యజనులతో వారి పాపములలో పాలిభాగస్థులు కాకూడదు, తద్వారా వారి మీదికి వచ్చు తీర్పులో కూడ పాలిభాగస్థులు కాకూడదు.[1]

**వచనము 8.** అన్యజనుల పాపములలో పాలిభాగస్థులై యుండుటకు తృణీకరించవలెనని

చెప్పుటకు గల ఒక నిశ్చయాత్మకమైన హేతువును గ్రంథ పాఠము తెలియజెప్పుచున్నది: **మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు; ... వెలుగు సంబంధుల వలె నడుచుకొనుడి.** వారు దేవుని పిల్లలు కాక మునుపు ఉండిన దాని కంటె ఇప్పుడు క్రైస్తవులు కొంత భిన్నమైనవారై యుండిరి. వారు పూర్వము ఏమైయుండిరో దానికిని ఇప్పుడు క్రీస్తునందు ఏమైయున్నారో దీనికిని మధ్య గల తారతమ్యము ఇంతకు మునుపు ఈ పత్రికలో వివరింపబడినది (2:1–22 చూడుము). వెలుగునకును (పాపము నుండి లభించిన రక్షణలో ఆనందంగా అనుభూతి చెందబడు దేవుని జీవితము) చీకటికిని (సాతాను మరియు పాపము వలన కలుగు మరణము) గల తారతమ్యము పాత నిబంధనలోను క్రొత్త నిబంధనలోను తరచుగా గమనింపబడుచునే యున్నది.[2] మనస్సు మార్పిడి దృష్ట్యా వెలుగు మరియు చీకటికి గల తారతమ్యము చూపింపబడింది (కొలొస్సయులకు 1:9–13; 1 పేతురు 2:9). ఎఫెసీ పత్రికలో, చీకటి అజ్ఞానమును (4:18) మరియు అనైతికమును (5:3–14 చూడుము). సూచించుచుండగా, వెలుగు సత్యము మరియు తెలివిని (1:17–19 చూడుము) మరియు దేవునికి ప్రీతికరమైన దానిని (5:10) సూచించుచున్నది.

ఎఫెసీయులు వెలుగులో ఉన్నారని పౌలు చెప్పలేదు, కానీ వారు వెలుగు *అయియున్నారని* చెప్పాడు. ఒకనాడు వారు చీకటియై యుండిరి, కానీ "ఇప్పుడైతే మీరు ప్రభువునందు వెలుగై యున్నారు" అని అపొస్తలుడు చెప్పుచున్నాడు. "ప్రభువునందు" లేక "క్రీస్తునందు" అను మాటలు వారి మనస్సు మార్పిడి గూర్చి చెప్పుచున్నవి, ఏలయనగా వారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి (రోమీయులకు 6:3; గలతీయులకు 3:27). వారు క్రీస్తునందు ఏమైయున్నారో దాని ప్రకారం ప్రవర్తింపవలెనని, అనగా, "వెలుగు సంబంధుల వలె నడుచుకొనవలెనని" పౌలు వారిని మందలించాడు. క్రీస్తునందు విశ్వసించనివారు వారి అవిధేయతనుబట్టి "అవిధేయులైన కుమారులు" అని గుర్తింపబడినట్లుగా (5:6) ఎఫెసీయులు వెలుగుతో గుర్తింపబడ్డారు గనుక వారు "వెలుగు సంబంధులు" అని పిలువబడ్డారు.

**వచనము 9.** "వెలుగు సంబంధుల వలె నడుచుకొనుట" అనగా నేమిటోయను తన వివరమును కొనసాగిస్తూ పౌలు, **వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి సత్యమను వాటిలో కనబడుచున్నది** అని రచించాడు. ఈ వాంగ్మూలము (NASBలో కుండలీకరణము గావింపబడియున్నది) వెలుగును, ఒక సారవంతమైన నేలగా లేక ఒక మంచి చెట్టుగా చిత్రించుచున్నది, అది "ఫలము" ఫలిస్తుంది. "నిష్ఫలమైన అంధకార క్రియలకు" భిన్నమైనదిగానున్న వెలుగు ఫలములో (5:11), "మంచితనము" (*agathōsunē*), నిర్దిష్టముగా నైతిక "మంచితనము" కలిసియున్నది.[3] ఈ అభిప్రాయము 2:10 యొక్క ప్రతిబింబమైయున్నది, అచ్చట పౌలు "వాటియందు మనము నడుచుకొనవలెనని, దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తునందు సృష్టింపబడినవారమై, ఆయన చేసిన పనియైయున్నామని" చెప్పుచున్నాడు. "మంచితనము" **ఆత్మ**ఫలములో ఒక భాగమై యున్నది (గలతీయులకు 5:22) గనుక క్రైస్తవుడు ఇతరులతో కలిగియుండు సంబంధములలోని కార్యకలాపములను వర్ణించుట కొరకు అది క్రొత్త నిబంధనలో పౌలు చేత మాత్రమే ప్రయోగింపబడింది. (ఇతర ప్రయోగముల కొరకు, రోమీయులకు 15:14; 2 థెస్సలొనీకయులకు 1:11 చూడుము.)

"నీతి" (*dikaiosunē*) అనగా దేవుడు మరియు మానవునితో గల సంబంధములో

దేవుని చేత ఏర్పాటు చేయబడిన ప్రమాణమునకు అనువర్తనముగా నుండు సరైన దానినే చేయుటయై యున్నది. "సత్యము" (*alētheia*) అనగా "నిజాయితీ," ఇది "అబద్ధమునకు" వ్యతిరేకమైనదై యున్నది.[4] "సత్యము" దేవుని వాక్యము కూడ (యోహాను 17:17). వారు "ప్రేమగలిగి సత్యము చెప్పుచుండవలెనని" మరియు "ప్రతివాడు తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెనని" పౌలు ఎఫెసీయులను విన్నవించుకొన్నప్పుడు (4:15, 25), ఆయన ఈ రెండింటిని నొక్కివక్కాణించుచుండెను. "[5:9లోని] ఈ మూడు సద్గుణములలో ప్రతి ఒక్కటి దాని పరిధిలో చాలా సాధారణమైనదై యున్నది గనుక వాస్తవానికి క్రైస్తవ జీవితమంతటికి ప్రాతినిధ్యం వహించుచున్నదై యుండగలదు."[5]

**వచనము 10. ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు** అను మాటలు "వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి" అను దానికి పొడింపబడిన వివరమై యున్నట్లు అర్థం చేసుకొనబడుచున్నది. పౌలు అటుతరువాత, "ప్రభువుయొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడని" సెలవిచ్చాడు (5:17). "పరీక్షించుచు" (*dokimazontes*) అనగా, "పరిశీలించుట, రుజువుచేయుట, వివేచించుట, వర్గీకరించుట" సరైన అర్థమై యున్నది.[6] దేవునికి ప్రీతికరమైనదేదో పరీక్షించుటకును లేక రుజువుచేయుటకును మరియు ఆయన చిత్తమేమై యున్నదో తెలిసికొనుటకును ఒక నిర్ణీత ప్రమాణము ఆవశ్యకమై యున్నది. ఆ ప్రమాణమే దేవుని వాక్యము. కొలొస్సయులకు 1:9–12లో, క్రైస్తవులు దేవుని చిత్తమును గూర్చిన తెలివితో నింపబడవలెననియు, దానిని సంపూర్ణముగా గ్రహించుటకు జ్ఞానము కలిగియుండవలెననియు, దేవునికి ప్రీతికరమగు రీతిలో జీవించవలెననియు పౌలు ప్రార్థించాడు. మొదటిగా, జ్ఞానము; రెండవదిగా, వివేచన; మరియు మూడవదిగా, దేవుని సంతోషపెట్టుట ఉండినవి. వారు "క్రీస్తు సువార్తకు తగినట్లుగా" జీవించవలెనని పౌలు ఫిలిప్పీయులను ఎంతో ప్రోత్సాహించాడు (ఫిలిప్పీయులకు 1:27, 28), అనగా, పరీక్షిస్తూ దేవుని వాక్యము యొక్క ప్రమాణము ప్రకారము జీవించుటయైయున్నది.

వారు "ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించవలెనని" అపొస్తలుడైన యోహాను తన పాఠకులకు చెప్పాడు (1 యోహాను 4:1). ఈ పరీక్షయే ప్రమాణమను ధ్వనింపునిచ్చుచున్నది, మరియు ఈ ప్రమాణము దేవుని ప్రత్యక్షతయైయున్నది. ఒకడు ప్రతి ఆలోచనను, ప్రతి మాటను, మరియు ప్రతి క్రియను బయలుపరచబడిన దేవుని చిత్తముతో పరీక్షించినప్పుడు, అప్పుడు – అప్పుడు మాత్రమే – దేవునికి ప్రీతికరమైనదేమిటో అతడు తెలిసికొనగలడు. ప్రాచీన కాలమందలి యూదులు ధర్మశాస్త్రములో నుంచి ఉపదేశింపబడి నందువలన వారు దేవుని చిత్తమును ఎరిగి యుండిరని పౌలు చెప్పుచున్నాడు (రోమీయులకు 2:18). ఒకడు బయలుపరచబడిన దేవుని చిత్తమును తెలిసికొనినప్పుడు, వాడు దేవునికేది ప్రీతికరమౌతుందో ఎరుగును. వాడు జీవితములో ఎదురయ్యే పరిస్థితులకు దేవుని వాక్యమను ప్రమాణము ప్రకారము ప్రతిస్పందించు కొలది, వాడు దేవుని సంతోష పరచుచున్నాడని తెలిసికొనగలడు. 10వ వచనంలోని సందర్భములో, వెలుగు సంబంధుల వలె మంచితనము, నీతి మరియు సత్యముతో జీవించుట అనగా ప్రభువునకు ఏది ప్రీతికరమైనదో ఎరిగియుండుటయై యున్నది, వాస్తవానికి, అది ఆయనను సంతోషపరచు విషయాలనే చేయుటయై యున్నది.

### అంధకారమును తృణీకరించి దాని క్రియలను బట్టబయలు చేయుట (5:11-13)

**[11]నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారైయుండక వాటిని ఖండించుడి. [12]ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులను గూర్చి మటలాడుటయైనను అవమానకరమై యున్నది. [13]సమస్తమును ఖండింపబడి వెలుగుచేత ప్రత్యక్షపరచబడును; ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగేగదా**

**వచనములు 11, 12.** నీతితో మరియు దుర్నీతితో కూడిన జీవిత విధానముల మధ్య గల తేడాపై తన దృష్టిని కేంద్రీకరిస్తూ, వారు **నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక, వాటిని ఖండింపవలెనని** పౌలు క్రైస్తవులను మందలించాడు (5:11). దేవుని పిల్లలముగా, మనము వెలుగైయున్నాము, వెలుగు సంబంధుల వలె జీవించుచున్నాము, గనుక మనము వెలుగు ఫలము ఫలించుదుము (5:8, 9). దీనికి తారతమ్యముగా, ఆయనను ఎరుగనివారు అంధకారమైయున్నారు (5:8), అవిధేయత కుమారులైయున్నారు (5:6), గనుక వారు "నిష్ఫలమైన అంధకార క్రియల" చేత గుర్తింపబడుచున్నారు.

"వెలుగు సంబంధులు" అంధకార క్రియలలో పాల్గొన కూడదు, కానీ కార్యశీలకముగా వాటిని "ఖండింపవలెను" (బట్టబయలు చేయవలెను). *Elenchō* నుంచి ఉత్పన్నమైన "ఖండింపవలెను" అను పదము "ఒప్పించుట," "గద్దించుట," "క్రమశిక్షణలో పెట్టుట" మొదలగు బహుముఖ అర్థము నిచ్చుచున్నది.[7] 5:11-13లో, అంధకార క్రియలు ఏమైయున్నాయో వాటిని బయలుపరచుట గూర్చి నొక్కివక్కాణింపబడింది. క్రైస్తవుడు అంధకారమును ఉదాసీనముగా సహించడు; కానీ దానిని ఉత్తేజితముగా ఖండించును. ఈ పదము క్రొత్త నిబంధనలో తోటి క్రైస్తవులను మందలించు ప్రక్రియలో ప్రయోగింపబడగా (1 తిమోతి 5:20; తీతు 1:9, 13), ఇచ్చటి సందర్భము అంధకారమునకు సంబంధించిన వారిని గూర్చి – రక్షింపబడని వారి గూర్చి – చెప్పుచున్నది.

"కాని వాటిని ఖండింపవలెను" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదజాలము ఒక బలమైన మందలింపును సూచిస్తుంది. క్రైస్తవులు నిష్ఫలమైన అంధకార క్రియలలో పాల్గొన కూడదు, కానీ వాటిని, మాటల్లోను చేతల్లోను బాహాటంగా ఖండింపవలసినవారై యున్నారని అది ఘోషిస్తుంది. నిష్ఫలమైన అంధకార క్రియలు క్రైస్తవుల జీవిత విధానము చేతనే ఖండింపబడవలెనని ప్రాతిపదికగా వ్యాఖ్యానించువారు కొందరు భావిస్తున్నారు. వారు వ్యక్తము చేయుచున్న దృక్పథమునకు 12వ వచనంలోని మాటలను వారు ఆధారం చేసుకొనుచున్నారు: ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులను గూర్చి మాటలాడుటయైనను అవమానకరమైయున్నది.[8] ఏది ఏమైనా, *elenchō* అను పదము పౌలు చేత ఇతర చోట్ల వాడబడుట నోటి మాట ద్వారా చేయబడు గద్దింపును సూచిస్తుంది (2 తిమోతి 4:2; తీతు 2:15 చూడుము).

"మాటలాడుట" అను పదము పునరుక్తమగుచున్న చర్యను సూచిస్తుంది. అంధకార పాపములు క్రైస్తవులు పనీ పాటా లేనట్లుగా వారిలోవారైనా లేదా యేసు క్రీస్తును విశ్వసించని వారి యెదుటయైనా ముచ్చటించుకొనుచునే యుండవలసిన విషయం కాదు. అట్లయినప్పటికిని, ఇటువంటి ప్రవర్తనను క్రైస్తవులు ఎదుర్కొనగలరు మరియు ఎదుర్కొనవలసిందే. నేటి సంస్కృతిలో క్రైస్తవులు ఎప్పుడు చూచినా అంధకార సంబంధమగు

పాపముల గూర్చే తోటి విశ్వాసులతో మాటలాడుచు అవి ఎంత చెడ్డవై యున్నవి కదా అని చెప్పుకొనకూడదు; కానీ దూషణ, విపరీత బుద్ధి, గర్భస్రావము, మరియు ఇతర పాపముల గూర్చి బాహాటంగా మాటలాడుకొనవలెను. నిశ్చయంగా, అంధకారమునకు తారతమ్యముగా ఉంటూ అంధకారమును గద్దించు జీవిత విధానమును క్రైస్తవుడు తప్పక అభ్యంసిచవలెను, కానీ అంధకారమునకు విరోధముగా మాటలాడుకొనుటకు ఒక సమయము సందర్భము మరియు స్థలము కూడా ఉన్నాయి. నీతిమంతమైన జీవితమునకు గల శక్తి గూర్చి అతిగా నొక్కివక్కాణించుకొనవలసిన అవసరం లేదు, కానీ మాటల శక్తి అంధకారమును బట్టబయలు చేస్తుంది (రోమీయులకు 1:18–32 చూడుము). ఎస్. డి. ఎఫ్. సాల్మండ్ ఇలా చెప్పుచున్నాడు,

> వారిని బాహాటంగా గద్దింపవలసిన అవసరం ఏర్పడుటకు, ప్రశ్నార్థకంగా ఉన్న పనుల రహస్యమే హేతువై యున్నది; మరియు అసలు విషయమేమనగా – మతేతరులు నోటితో పేర్కొనుటకైనను హేయమైనవైయున్న దుర్వ్యసనములను రహస్యంగా అభ్యసించుదురు; గనుక మౌనంగా చూస్తూ ఉదాసీనంగా ఊరుకొనియుండుటకు బదులుగా బాహాటంగా గద్దించుట అంత కంటె ఎక్కువగా అవసరమై యున్నది ...[9]

**వచనము 13.** అంధకారము దాచిపెట్టేదానిని వెలుగు బట్టబయలు చేస్తుంది. వెలుగు ప్రకాశించుచుండు చోట, **సమస్తము కంటికి సుస్పష్టంగా కనబడుతుంది**. అంధకార క్రియలు **వెలుగు చేత** బట్టబయలు చేయబడినప్పుడు, **కంటికి కనబడునదంతా వెలుగే ఔతుంది**. క్రైస్తవులు అంధకార క్రియలు దుష్ట స్వభావమును బట్టబయలు చేసినప్పుడు, అంధకారములోనున్న వారు "వెలుగు" అగుటకు వారికి ఒక అవకాశాన్ని అందుబాటులో ఉంచుచున్నారు. యేసు ఇలా సెలవిచ్చాడు,

> ఆ తీర్పు ఇదే, వెలుగు లోకములోనికి వచ్చెను, గాని తమ క్రియలు చెడ్డవైనందున, మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడియున్నవని ప్రత్యక్షపరచబడునట్లు, వెలుగునొద్దకు వచ్చును (యోహాను 3:19–21).

సత్యము వెలుగై యున్నదనియు, చెడు చీకటియై యున్నదనియు ఆయన చెప్పాడు. ప్రజలు అంధకార దుష్టత్వమును ప్రేమిస్తూ వెలుగును ద్వేషించునప్పుడు, వారు తీర్పునకు దారి తీయు అంధకారములోనే కొనసాగుచుందురు. సత్యములో గల మంచిని ప్రేమించువారు "వెలుగు" నొద్దకు వచ్చెదరు గనుక వారి క్రియలు దేవుని చేత ఆమోదింపబడినవని వారికి అభయమియ్యబడుచున్నది.

### మెలకువగానుండుట (5:14)

**[14]అందుచేత, –నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని ఆయన చెప్పుచున్నాడు.**

**వచనము 14.** మూడు వరుసలను ఉల్లేఖించి చెప్పుచూ "వెలుగు సంబంధులను"

గూర్చిన ఈ విభాగాన్ని పౌలు ముగించుచున్నాడు; **నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించును.** పద్యమును **అందుచేత** అను మాటలతో ఆయన పరిచయము చేస్తున్నాడు, ఇది ఆయన 4:8లోని ఉల్లేఖనమునకు ముందు ఉపయోగించిన అదే విధమైన ఒక వ్యక్తీకరణమై యున్నది. ఏది ఏమైనా, ఈ పద్యములోని మాటలు లేఖనములలో మరెచ్చోటనైనను అగుపించవు. అత్యధికంగా ఇటువంటిదే అయియున్న పాత నిబంధన ప్రకటన యెషయా 60:1లో కనబడుచున్నది; కానీ ఇచ్చట, దేవుడు ఆయన ప్రజలకు వెలుగును ప్రకాశింపజేసినందులకు ఆయనకు స్తుతులొనర్చుట గూర్చి యెషయా మాటలాడుచుండెను. పౌలు ఈ పద్యాన్ని తన పాఠకులకు ఒక సవాలుగాను ఒక వాగ్దానముగాను నివేదించుచున్నాడు.

పౌలు పాత నిబంధనలో నుండి తీసికొనబడిన ఒకటి రెండు వరుసలను దండాన్వయము చేయుచుండెనని కొందరు వ్యాఖ్యాన కర్తలు భావించుచున్నారు. క్రొత్త నిబంధన రచయితలు ఉల్లేఖనములను స్వేచ్ఛగా ఉపయోగించుట అసాధారణమైన అంశమేమీ కానిదై యుండెను, గనుక పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన కూడా ఇటువంటి పదజాల ప్రయోగమునకు నేపథ్యమును సూచించుచున్నవి. వెలుగు, దేవుడు ఆయన ప్రజలకు పరిచర్య చేయుటకు వచ్చుటతో సంబంధము కలిగియున్నది (ద్వితీయోపదేశకాండము 33:2; కీర్తనలు 50:2; 80:1–3, 7, 19 చూడుము), మరియు క్రీస్తు తరచుగా వెలుగుగా చిత్రీకరింపబడియున్నాడు (లూకా 2:32; యోహాను 1:4–9; 3:19–21; 8:12; 9:5; 12:46; ప్రకటన 1:16 చూడుము).

పౌలు ప్రేరేపింపబడని ఏదో ఒక మూలాధారము నుండి (అపొస్తలుల కార్యములు 17:28లో వలె) ఉల్లేఖించుచుండెనని ఇతరులు అనకొనుచున్నారు, బహుశా అదొక అప్రమాణిక గ్రంథ రచనయై, ఒక ఆది కాల క్రైస్తవ సంగీతమై, లేదా యేసు పలికినను గ్రంథస్థంచేయబడని ఒక ప్రకటనయై యుండవచ్చును.[10] ఈ పద్యము యొక్క మూలమును మనము నిశ్చయంగా తెలిసికొనలేకపోగా, పౌలు దానిని సద్వినియోగము చేసుకొన్న విషయము స్పష్టంగా ఉన్నది. క్రీస్తు సందేశమును ఆలింగము చేసుకొనువారికి, వారు ఆధ్యాత్మిక మరణ నిద్రావస్థలోనే ఉండినప్పటికిని, పునరుత్థానము వాగ్దానము చేయబడియున్నది. క్రీస్తు యొక్క జీవము మరియు వెలుగు (యోహాను 8:12; రోమీయులకు 6:1–4 చూడుము) వారి అంధకార క్రియల నుంచి వెనుదిరిగి "వెలుగు పిల్లల వలె నడుచుకొనువారితో" కలిసిపోవుటకు వచ్చు వారి కొరకు వేచియున్నవి (5:8).

> వెలుగు చీకటికి వ్యతిరేకమైనది మరియు దానితో పొసగనిదైయున్న ప్రకారంగానే, సంఘము దాని విలువలకు సమగ్రముగా వ్యతిరేకమైనవైయున్న సామాజిక విలువల ప్రకారం గాక, తన సొంత విలువల చేత జీవించవలసియున్నదను విషయం పాఠకులు గ్రహించాలని రచయిత ఆశిస్తున్నాడు ... చుట్టుముట్టియున్న అంధకారము చేత అవినీతిమయమగుట కంటె విశేషంగా, విశ్వాసులు వారి ప్రభావము దానిపై ప్రబలముగా ప్రబలునట్లు చూచుకొనవలెనని విన్నవించుకొనబడుచున్నారు. పాఠకులు వారి ప్రవర్తన ఇతరులపై వెలుగు కిరణంవలె ప్రకాశిస్తూ, జీవితము జీవింపబడవలసిన విధానమును వెలిగించుచుండు సమాజము కంటె తక్కువైనవారై యుండకూడదు ... అప్పుడు వెలుగు దాని చుట్టూరనున్న అంధకారమును నిర్మూలించును. చీకటి వెలుగుతో కలిగియుండు సంఘర్షణలో, అది

చివరకు వెలుగుపై విజయం సాధించనేరదు, ఏలయనగా పునరుత్థానుడైన క్రీస్తు దానికి మూలమైయున్నాడు.[11]

## అన్వయము

**వెలుగు సంబంధులు (5:6–14)**

5:6–14లో, క్రైస్తవులు "నడుచుకొనవలసిన" విధానమును గూర్చిన మూడవ ప్రకటన చేస్తూ, పౌలు, 8వ వచనంలో తన పాఠకులు "వెలుగు సంబంధుల వలె నడుచుకొనవలెనని" వారిని విన్నవించుకొన్నాడు.

*తారతమ్యము.* "వెలుగు" మరియు "చీకటి" మధ్య గల తారతమ్యమును లేఖనములు మనముందుంచుచున్నవి. "వెలుగు" దేవున్ని, దేవుని మార్గమును, ఆయన శక్తిని, మరియు క్రైస్తవులను సూచించుచున్నది. "అంధకారము" సాతాను, లోకము నడుచుకొను మార్గము, సాతాను శక్తి, మరియు నశించినవారిని సూచించుచున్నది.[12] "వెలుగు" మరియు "అంధకారము" క్రీస్తు మరియు దుష్టునికి సంకేతములుగానున్నవి (యోహాను 1:1–5, 9; 3:19–21; 8:12; 12:35, 36). ఇంకా, "వెలుగు"నకును మరియు "అధకారము"నకు గల సంబంధములు విశ్వాసనీయులైన క్రైస్తవులకును అవిశ్వాసులైన వారికిని గల తారతమ్యమును పోల్చుచున్నవి (1 యోహాను 2:4–11).

*అభయము.* వెలుగులో నడుచుకొనుట వలన క్రైస్తవుడు దేవునితో సరైన సంబంధమును నిశ్చయముగా కలిగియుండును మరియు వాడు నిరంతరము పాపములో నుండి కడుగబడుచున్నాడను అభయము దొరుకును.

*తెలివి.* వారు వెలుగు ఫలము ఫలించునప్పుడు, వారు "వెలుగు"లో నడుచుకొనుచున్నారని (5:9), దేవునికేది ప్రీతికరమో (5:10) క్రైస్తవులు తెలిసికొందురు, మరియు అది అంధకార క్రియలను బట్టబయలు చేయును (5:11–14). క్రైస్తవులు తమ జీవితములను దేవునికి అప్పగించుకొని ఆయన ప్రజల వలె జీవించునప్పుడు, వారు సరైన ఫలము ఫలించునట్లు ఆయన వారికి సహాయము చేయును. లేఖనములను అధ్యయనము చేయుట ద్వారా దేవునికేది ప్రీతికరమో వారు తెలిసికొందురు. క్రైస్తవులు సరైన జీవితం జీవిస్తూ, దుష్టత్వమునకు వ్యతిరేకముగా దృఢముగాను దయతోను మాటలాడినప్పుడు, సమాజముపై అది ఎంతో గొప్ప ప్రభావమును చూపును.

*"ప్రభువునందలి వెలుగు."* పౌలు ఎఫెసీయులను "ప్రభువునందలి వెలుగు"గా చిత్రించాడు (5:8). ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు, వాడు దేవునితో సమాధానపరచబడ్డాడు, పాపము నుండి విమోచింపబడ్డాడు, మరియు సమస్త ఆధ్యాత్మిక ఆశీర్వాదముల గ్రహీత గావింపబడ్డాడు; వాడు లోకమునకు వెలుగౌతాడు (1:3–14; 2:13–16; మత్తయి 5:16 చూడుము).

*ముగింపు.* క్రైస్తవులు లోకములో ఉన్నారు, కానీ లోక సంబంధులు కారు సంఘము లోకమును ఆలింగనము చేసుకొనదు, కానీ వెలుగు చీకటి లోపలకు చొచ్చుకొనిపోయినట్లు, లోకమును ఎదుర్కొంటుంది.

జేయ్ లాక్‌హార్ట్

**దేవుని పోలి నడుచుకొనువారు (5:1-14)**

వారు ఎవరినైతే ప్రేమిస్తారో వారినే ఎల్లప్పుడు అనుకరించుట ప్రపంచంలోని పిల్లల్లో గల ఒక గుణలక్షణమైయున్నది. వాడు తినడానికి ఏంకావాలో అని ఒక పిల్లవానిని తన తల్లి అడిగినప్పుడు, ఆ కుమారుడు, "నాన్నగారు ఏంభోంచేస్తున్నారో నాకు కూడా అదే కావాలి" అని అంటాడు. వారు అసలు స్వరూపులై యుండుట గూర్చి పిల్లలు అంతగా ఆలోచించరు; వారు ఎక్కువగా వారనుకరించు మాదిరుల గూర్చియే ఆలోచించుచుందురు.

దేవుని పిల్లలముగా, మనము "దేవుని పోలినవారమై" యుండవలెనని కోరబడుచున్నాము (5:1). మనము దేవుని పోలి యుండగోరుచున్నట్లయితే, మనమెలా జీవించాలి? 5:1-14లో, "దేవుని పోలి నడుచుకొనువారు" రెండు విధాల్లో ఆయన వలెనే ఉంటారని సెలవిచ్చుచున్నాడు.

1. *ప్రేమగల పిల్లలు* (5:1-7). "కావున మీరు ప్రియులైన పిల్లలవలె, దేవునిపోలి నడుచుకొనుడి; క్రీస్తు మిమ్మును ప్రేమించి, … మన కొరకు తనుతాను … అప్పగించుకొనెను, అలాగుననే మీరును ప్రేమ గలిగి నడుచుకొనుడి" (5:1, 2).

ఈ మొదటి లక్షణమును అర్థంచేసుకొనుటకు గల కీలకము "కావున" అను పదములో దాగియున్నది. ఈ పదము మనము 4:32లో గల సూత్రమును చూచునట్లు చేయుచున్నది: "ఒకని యెడల దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకనినొకడు క్షమించుడి." దేవుడు ప్రేమగల క్షమాపణ కర్తగా చిత్రింపబడుచున్నాడు. మనమే ప్రేమపూర్వకంగా క్షమించువారమగుట ద్వారా దేవునిపోలి నడుచుకొనవలెనని పౌలు ఇచ్చుచున్న ఆజ్ఞను నెరవేర్చుచున్నవారమౌదుము. మనము దయగలవారమై యుండవలెను; మనము కరుణాహృదయులమై యుండవలెను; కఠినులముగా కాదు, హృదయము బండబారినవారముగా కాదు, ఉదాసీనముగా ఉండకూడదు. మనము క్షమించువారమై యుండవలెను. ఇదే, వాస్తవము గావింపబడిన ప్రేమయైయున్నది, ఏలయనగా క్షమించజాలని ప్రేమ నిజమైన ప్రేమ కాదు.

మత్తయి 18లో, యేసు ఈ సూత్రంపై చేసిన తన సొంత వ్యాఖ్యానం మనకు కనబడుతుంది, ఒకడు తన సహోదరుని ఎన్ని సార్లు క్షమించాల్లో చెప్పుమని పేతురు ప్రభువు నడిగాడు. ఒకడు ఎవరినైనా గాని ముమ్మారు మాత్రమే క్షమించాలని యూదుల మత బోధకులు బోధించారు; ఆ తరువాత, వాడు తన కర్తవ్యమునకు బాధ్యుడై యుండడు. పేతురు, బహుశా ఆయన శిక్షణలో తాను ఎంతో పరిపక్వత చెందాడని ప్రభువునకు ఒక కర్తవ్యమునకు బాధ్యుడై యుండడు. పేతురు, బహుశా ఆయన శిక్షణలో తాను ఎంతో పరిపక్వత చెందాడని ప్రభువునకు ఒక సదభిప్రాయము కలుగజేయాలను సదుద్దేశంతో కాబోలు అలా అడుగుచునే, "ఏడు మారుల మట్టుకా?" అంటూ తానడిగిన ప్రశ్నకు తానే సమాధానం ఇచ్చాడు. అందుకు యేసు, "ఏడు మారుల మట్టుకే కాదు, డెబ్బది ఏళ్ల మారుల మట్టుకు" అని చెప్పాడు (మత్తయి 18:22). విషయం, ఎన్ని మారులు అని ఏదో లెక్కలు రాసుకొనడం కాదు, కానీ వైఖరి ముఖ్యమైయున్నది. దేవుని ప్రేమను పోలి నడుచుకొనుటకు క్షమించే వైఖరి మూలాధారమై యున్నది.

మనము దేవుని యెడల తప్పు చేసామా? సహజంగానే, చేసాము! మనము ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేసాము, ఆయనను తృణీకరించాము, ఆయనను ద్వేషించాము,

ఆయనను నిరాకరించాము. అట్లయినప్పటికిని, అయన మనలను క్షమించాడు. సిలువపై క్రీస్తు మరణించుట దేవుని పక్షము నుండి స్పష్టమైన, అయోగ్యమైన క్షమాపణయై యుండింది (రోమీయులకు 5:8). మనము ప్రదర్శించాల్సిన క్షమాపణ, సరిగ్గా ఇదే.

ఆ విధమైన క్షమాపణకు ప్రోత్సాహకమిచ్చునదేమిటి? అది ప్రేమే. 2వ అధ్యాయంలో పౌలు ఏ విషయం గూర్చి ఉపదేశించాడో ఒక సారి గుర్తుచేసుకొనండి. మనము పాపములో చచ్చినవారమై యుంటిమి; మనము ఈ లోక మర్యాదను అనుసరించితిమి. మనము అవిధేయులమై యుంటిమి; మనము శరీరాశల ప్రకారంగా పనులు చేసాము. "అయినను దేవుడు, కరుణాసంపన్నుడై యుండి, మనము మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతో కూడ బ్రతికించెను ..." (2:4, 5).

సిలువ, క్షమాపణను ఒక వాస్తవం చేస్తే, దేవుని ప్రేమ, సిలువను ఒక వాస్తవం చేసింది. దేవుడు మనలను క్షమించిన ప్రకారము మనము కూడ ఒకరినొకరము క్షమించుకొనవలెనని పౌలు చేయుచున్న మందలింపు వెనుక గల మర్మము ఇదే. అందు చేతనే పౌలు, "కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవుని పోలి నడుచుకొనుడి ... ప్రేమ కలిగి నడుచుకొనుడి" అని సెలవిచ్చాడు (5:1, 2).

మన యెడల తప్పిదము చేసిన ప్రతి ఒక్కరిని మనము క్షమించుటకు ప్రేమ కలిగి ముందుకు వెళ్లుచుండవలెనని పౌలు మనలను సవాలు చేయుచున్నాడు. ఇదొక కష్టమైన పనే ఏలయనగా ద్వేషభావములను మనస్సులోనే దాచుకొని అవి మనలను లోలోపలనే బాధిస్తూ కుళ్లుకంపుకొట్టునట్లు చేసికొనుట సులభము. క్షమించుటకు దేవుడు ఇష్టపడపటయే మన ప్రామాణికమై యున్నది.

(1) ఒక పునరుత్పత్తి ఉదాహరణము. మనము ఆయనను పోలి యుండునట్లు మనకు ఒక మందలింపును మించినది అవసరమైయున్నదని దేవుడు ఎరిగియుండెను; మనము అనుసరిస్తూ, ఇతరులు మనలను అనుకరించునట్లు చేయగలుగుటకు మనకు ఒక మాదిరి ఆవశ్యకమై యుండింది. ఆ మాదిరి ప్రతి క్రైస్తవ విశ్వాసికి క్రీస్తు యేసే. మానవ శరీరధారియై వచ్చిన దేవుడే. దేవుడు మనలను ఎలా ప్రేమిస్తున్నాడో తెలిసికొనవలెనని నీవు ఆశిస్తున్నావా? అలాగైతే యేసును చూడు. ఆయన "నిన్ను ప్రేమించాడు, మన కొరకు తనను తాను ... అప్పగించుకొన్నాడు." ప్రేమలో కదలికను కలుగజేసేది ఇదే: తన కోసం "లేదు/ కాదు" అని చెప్పుకొంటూ, తననుతాను ఇతరుల కోసం అప్పగించుకొనగల సామర్థ్యం. యథార్థమైన ప్రేమ, మన ప్రభువు చేత ప్రదర్శింపబడింది, అది నిస్వార్థమైంది, అది ఇచ్చునది, అది త్యాగపూరితమైంది, మరొకరు దీవింపబడునట్లు మన సొంత హక్కులను అప్పగించుకొనుటకు అది వినయపూర్వకముగా ఇష్టపడునది.

నిశ్చయంగా, మనము జీవించుచున్న ఈ లోకము ఏర్పాటుచేయు మాదిరి ఇది కాదు. లోకం మాదిరి ఏమనగా: "నీవు నా అవసరతలు తీర్చుచున్నంత వరకు, నీవు నా చుట్టుప్రక్కల ఉండవచ్చును." లోకము అభ్యసించు ప్రేమ వస్తుగతముపై ఆధారపడుతుంది. "ప్రేమించుటకు నీవు చాలా బాగున్నావు గనుక నేను నిన్ను ప్రేమించుచున్నాను"; "నాకు విరోధంగా గాని నా మనస్సు గాయపడు విషయం గాని నీవేదీ చేయలేదు గనుక నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని అది చెప్తుంది.

దేవుని ప్రేమ అలాంటిది కాదు. దేవుని ప్రేమ, "నీవు నాకు విరోధముగా ఏమైనా చేసినట్లయితే, నా స్నేహితుడా, నీవేంచేసినా, నీవు తిరిగి పొందేది నా ప్రేమే!" అని చెప్తుంది. దేవుని విషయంలో, ప్రేమ ఎన్నడును వస్తుగతము చేత నియంత్రింపబడదు. ఆయన సవభావమే ప్రేమించుట గనుక ప్రేమ ఆయనలో నుంచి నిరంతరము పెల్లుబికి ప్రవహించుచుండును.

(2) *చెడును పరిత్యజించుము.* మనము దేవుని పోలి నడుచుకొనవలసియున్నట్లయితే, వక్రీకరింపబడిన కొన్ని విధములైన ప్రేమను మనము పరిత్యజించవలసినదే (5:3, 4).

ప్రేమను గూర్చిన లోకము యొక్క అవగాహన పెడదారి పట్టింపబడింది. అది ఇచ్చట పౌలు పేర్కొనిన ఒక్కొక్క పాపము చేత ప్రదర్శింపబడినట్లు, ఆత్మాభిమానముతో కూడినదై యున్నది. ఉదాహరణగా లైంగిక అవినీతిలో ప్రతి విధమైన లైంగిక సంబంధ పాపము కలిసియున్నది మరియు అది స్వయం సంతృప్తిని దాని ప్రధాన ఉద్దేశంగా కలిగియున్నది. తన భార్య పట్ల విశ్వాసఘాతుకుడైన భర్త గూర్చి ఒక సారి ఆలోచించండి. ఆమెకు అత్యంత ప్రీతికరమైన దానిని అతడు చేయుచుండడు. అతడు చేసేదంతా తన సొంత కోరికలను మరియు శరీరాశలను తనకు తృప్తికరంగా ఉండునట్లు తీర్చుకొనుట మాత్రమే. మనము అనుకరించవలెనని యేసు మనకిచ్చిన మాదిరి ఇది కాదు.

"లోభత్వము" అను పదము పౌలు ఇచ్చిన జాబితాలో ఉండవలసినది కాదని మొదట అగుపించుచున్నది. వాస్తవమునకు, అది, కూడ, ఒక విధమైన వక్రీకరింపబడిన ప్రేమే. పదవ ఆజ్ఞ, "నీ పొరుగువాని భార్యను ఆశింపకూడదు, నీ పొరుగువాని ఇంటినైనను ... నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదని" సెలవిచ్చుచున్నది (ద్వితీయోపదేశకాండము 5:21). లైంగిక దుర్నీతిలో తనది కానిదానిని ఆతురతతో ఆకాంక్షించుట, లేక కోరుకొనుట కలిసియుండి, ఒక తగని సంబంధమైయున్నది. ఇటువంటి సందర్భములో, తనది కానిదానిని ఆతురతతో ఆకాంక్షించుట వలన ఒకడు తన సొంత మేలు లేదా సంతృప్తి కొరకే ఏదైన ఒక చర్యను చేపట్టవచ్చును, కానీ వాని పొరుగువాని మేలు కొరకు మాత్రము కాదు. ఇదొక విధమైన ఆత్మాభిమానమై యున్నది, గనుక, తత్ఫలితంగా, అది పెడదోవ పట్టిన ప్రేమయై యున్నది. ఇవి దేవుని జనులకు "తగని"చర్యలై యున్నవని పౌలు ఘోషించుటలో ఆశ్చర్యమేమీ లేదు (5:4).

మనము ఇటువంటి కార్యములు చేయుట నుంచి మాత్రమే నిగ్రహించుకొనుట కాదు, కానీ వాటి గూర్చి మాటలాడుటయైనను మనకు తగదు. అశ్లీల దృక్పథంతో మాటలాడకూడదు. (ఈ సందర్భములో, మనము ప్రత్యేకించి లైంగిక సంబంధమైన వ్యాఖ్యానాల గూర్చి ఆలోచించుచున్నాము.) మనము వ్యర్థమైన మాటల్లో, దేవుడు తన ప్రజల కొరకు నియమించిన ఔన్నత్యమైన ప్రమాణములు ఎగతాళి చేయబడుచు వాటిని వెక్కిరింతల పాలుజేయు మూర్ఖపు సంభాషణల్లో కూడ సమయము గడుపకూడదు. "పోకిరి మాటలు" అను పదము "సులభంగా మార్చివేయగల" అని అర్థమిచ్చు గ్రీకు పదము నుండి ఉత్పన్నమయ్యింది. కొందరు ఏ మాటనైనా లేదా ఏ విషయాన్నైనా ఏదో ఒక అసభ్యకరమైన అంశంగా అతి సులభంగా మార్చివేయగలరు. దుర్నీతితో కూడిన ఇటువంటి మాటలన్నీ దేవుని పోలి నడుచుకొనువాని జీవితానికి కళంకము కలుగజేస్తాయి. ఒకడు ఒక వైపు దేవుడు ప్రేమించినట్లే ప్రేమిస్తూ, అదే సమయంలో మరొక వైపు దేవునికి ప్రీతికరమైన

విషయాల విలువను తగ్గించు బూతు మాటలు పలుకజాలడు.

పెడదారి పట్టిన ప్రేమతో కూడిన జీవితాన్నే కొనసాగించుచుండు వారికి లేఖనాలు ఒక బలమైన హెచ్చరిక నిచ్చుచున్నవి:

> వ్యభిచారియైనను, అపవిత్రుడైనను, విగ్రహారాధికుడై యున్న లోభియైనను క్రీస్తుయొక్కయు దేవునియొక్కయు రాజ్యమునకు హక్కుదారుడు కాడను సంగతి మీకు నిశ్చయముగా తెలియును.
>
> వ్యర్థమైన మాటలవలన ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి; ఇట్టి క్రియల వలన దేవుని ఉగ్రత అవిధేయులైనవారిమీదికి వచ్చును గనుక మీరు అట్టివారితో పాలివారై యుండకుడి (5:5-7).

"నీకిష్టమైనది నీవు చేయడానికి నీకు హక్కున్నది! వివాహము కాకముందటి లైంగిక సంబంధము తప్పేమీ కాదు" అని మనము జీవించుచున్న ఈ లోకము మనకు చెప్పుచున్నది. వారు ఇటువంటి విషయాలను నమ్మెదురని సాధికారంతో చెప్పుకొనువారు తమ సొంత శారీరక కోరికలను తీర్చుకొనుటలో మాత్రమే ఆసక్తిగలవారై యున్నారు. మనము లోకము యొక్క తత్త్వము చేత మోసపోకూడదని పౌలు మనలను హెచ్చరించుచున్నాడు. ఈ లోక సంబంధులు నిర్హేతుకముగా పనులు చేయుటకు వెనుకాడు మానసిక ప్రవృత్తి నుంచి స్వేచ్ఛ మరియు స్వతంత్రము గూర్చి మాటలాడుదురు, కానీ ఇతంతా అహం కేంద్రీకృతమైయున్న ఆలోచనయైయున్నది. "ఇటువంటి మాటలను నమ్మవద్దు. చివరకు దేవుని ఉగ్రత పెడదారి పట్టిన ప్రేమతో జీవించువారందరి మీదికి - 'మేము క్రైస్తవులము' అని చెప్పుకొనువారి మీదికి సహితము - వచ్చును. మీకు యేసు చూపిన దైవికమైన ప్రేమ మాదిరి ప్రకారము నడుచుకొనుచుండుమని" పౌలు చెప్పుచుండెను.

2. *వెలుగు సంబంధులు* (5:8-14). "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు; ... ప్రభువుకేది ప్రీతికరమైనదో పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి" (5:8-10). వెలుగు, సత్యమునకు చిహ్నమై యున్నది. ఒకప్పుడు మన జీవితములు వెలుగు సంబంధము కానిదానంతటితో గుర్తింపబడినవి (5:8). మనము ఆధ్యాత్మిక అంధకారములో నడుచుకొనుచు దేవుడు ప్రతినిధియైయున్న సమస్తమునకు విరోధమైన క్రియలు చేయుచుంటిమి. ఇప్పుడైతే, యేసును వెంబడించుట ద్వారా, మన మనోనేత్రములు తెరువబడినవారమయ్యాము; గనుక మనము సత్యము చొప్పున నడుచుకొనుచున్నాము. వివాహములను, సంబంధములను, మరియు వృత్తులను ఛిన్నాభిన్నము చేయు అబద్ధ విలువలను మరియు ప్రవచనములను మనము కనిపెట్టి కనుగొనగలము. అప్పుడు మన కన్నులు పాపమును చూచి అది ఉన్నది ఉన్నట్టుగా దానిని పాపముగానే పరిగణించును గనుక "ఈ కార్యము చేయుటలో నాకు ఎటువంటి తప్పైనను తోచడములేదని" మనము యికమీదట పలుకము.

(1) మన గుణలక్షణములు (5:9). మనమిప్పుడు అంధకారములో నుంచి వెలుగులోనికి మార్చబడినందునుబట్టి మన జీవితములను మూడు గుణలక్షణములు గుర్తిస్తాయి. మొదటిది, "మంచితనము." దుష్టస్వభావమునకు (4:31) బదులుగా విశేషంగా, మన జీవితములు ఇప్పుడు కార్యశీలమైన ఉదారతతో నింపబడియున్నవి. మనము ఇతరుల అవసరములను వెదకుచు వారి జీవితములో వాటిని తీర్చుచుందుము. రెండవది, "వెలుగు సంబంధులైన

పిల్లలు" "నీతి"తో కూడ గుర్తింపబడుదురు. మనము సరైన దానినే చేయుచుందుము ఏలయనగా తద్వారా దేవుడు మహిమపరచబడును. ఇప్పుడు మనము విషయాలను దేవుని దృక్పథముతో చూచుచు ఆయన తీర్చినట్లే తీర్పులు తీర్చుచుందుము, ఆయన కిష్టమైన విధానంలోనే మనము జీవించవలసియున్నది. వెలుగు యొక్క మూడవ ఫలము, "సత్యము." మునుపటి జీవితము వేషధారణ మరియు అబద్ధములతో కూడినదై యుండింది. ఇప్పుడైతే, మనము నైతికవర్తమానము, ఆధారపడదగిన, విశ్వసనీయత, నిజాయితీ, మరియు విశ్వాసపాత్రతతో కూడిన జీవితములు జీవింపవలసి యున్నది.

మనము నీతిమంతమైన క్రియలు చేసినంత మాత్రాన వెలుగు సంబంధులము కాము. అది అందుకు వ్యతిరేకమైనదై యున్నది. వారు చాలినంత మంచి చేసినట్లయితే వారు రక్షింపబడుటకు అది చాలునను తప్పుడు అభిప్రాయము కొందరిలో కలదు. అసలు సత్యమేమనగా మనము మొదట వెలుగు సంబంధులము కావలెను, అటుతరువాత మంచితనము, నీతి, మరియు సత్యము అను వెలుగు ఫలము ఫలించవలెను. ఇవి రక్షింపబడినందు వలన కలుగు ఫలితములే కానీ, రక్షింపబడుటకు హేతువు కావు.

(2) మనకివ్వబడిన ఆజ్ఞ. "నిష్ఫలమైనఅంధకార క్రియలలో పాలివారైయుండకుడి" (5:11). పౌలు రెండు పర్యాయములు, క్రైస్తవులు వాటికి దూరముగా నుండవలెనని ఆజ్ఞాపింపబడిన నిష్ఫలమైన కార్యముల జాబితా నిచ్చాడు (4:17–31; 5:3, 4). మనము అంధకారములోనున్న వారితో సహవసించ కూడదు.

ఇటువంటి క్రియలకు మనము దూరముగా నుండవలెననుటకు గల కారణము ఏమనగా అవి "నిష్ఫలమైనవి." పౌలు తెలియజెప్పుచున్న తేడా ఒక విధమైన ఫలమునకును మరొక విధమైన ఫలమునకును మధ్యనున్నది కాదు. ఆ తేడా ఫలించుట మరియు ఫలించకపోవుట గూర్చినదైయున్నది. పూర్వ జీవితము యొక్క కార్యములు ఫలము లేనివి మరియు ఫలించనివై యున్నవి. ఆ విధముగా జీవించుటలో చిరకాలముండు సమాధానముగాని సంతృప్తిగాని ఉండవు. మనలో అంతర్గతముగా దాగియున్న సామర్థ్యము కొలది మనము జీవించునట్లు నిష్ఫలమైన కార్యములు మనకు సహాయకరముగా నుండవు. పాపిష్ఠియైన కార్యములు ఎంతో ఎక్కువ వాగ్దానము చేస్తాయి, కానీ అవి శూన్యమైన చిల్లచిప్పల వంటి నిరర్థకమైన వాగ్దానములని కాలమే వాటిని బట్టబయలు చేస్తుంది.

*ఆజ్ఞ స్పష్టముగానున్నది.* మనకు అంధకార పద్ధతులతో ఎటువంటి బంధముగాని సంబంధముగాని ఉండకూడదు. దేవుని పోలి నడుచుకొనుచున్నవారముగా, మనము పొందిన వెలుగులో మనము నడుచుకొనుచుండవలెను.

(3) మనకు అప్పజెప్పబడిన బాధ్యత. "... పాలివారై యుండక వాటిని ఖండించుడి; ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులను గూర్చి మాటలాడుటయైనను అవమానకరమైయున్నది" (5:11–13). మనము అంధకార క్రియల నుండి తప్పుకొనుట ద్వారా, మనలను మనము లోకములో నుంచి ఒంటరివారముగా వేరుచేసుకొనకూడదు. కానీ విశేషంగా, మనము లోకము యొక్క అంధకార క్రియలపై వెలుగు ప్రకాశింపవలెనని ఆదేశములియ్యబడినవి. కార్యములు సరైన విధంగా ఎలా చేయాలో లోకమెరుగదు ఏలయనగా లోకము అంధకారములో జీవించుచున్నది. అంధకార క్రియలు అవి చేయబడుచున్నట్లు ఎలా మరియు ఎందుకు చేయబడుచున్నవో,

దేవుడు ఆయన చేసిన సృష్టియంతటి విషయంలో కలిగియున్న తన నిత్య సంకల్పమును బయలుపర్చుచు వివరించవలసిన బాధ్యత మనకు అప్పజెప్పబడియున్నది.

మనకు అప్పజెప్పబడిన బాధ్యతను నిర్వర్తించునప్పుడు, వారు చేయుచున్న తప్పేమిటో దాని గూర్చి ఇతరులతో మాటలాడవలెను, అయితే ఇది ఎన్నడును అంత సులభం కాదు. "ఆ తీర్పు ఇదే, వెలుగు లోకములోనికి వచ్చెను, గాని తమ క్రియలు చెడ్డవైనందున మనష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగు నొద్దకు రాడు" అని యోహాను భక్తుడు చెప్పుచున్నాడు (యోహాను 3:19, 20).

*ముగింపు.* దైవభీతి లేని ఈ లోకంలో మనము దేవుని పోలి నడుచుకొనుచున్నవారమై యుండుటకు పిలువబడియున్నాము. అనగా మనము వెలుగునకు మరియు ప్రేమకు, ఈ రెండింటి గూర్చి ఏమీ తెలియని ప్రజల మధ్య ప్రతినిధులమై యుండవలెను. అలాగని, ఇతరుల యెడల "నీ కంటే నేనే ఎక్కువ పరిశుద్ధుడను" అను వైఖరిని పెంపొందించుకొనాలని చెప్పడం కాదు. అందుకు భిన్నంగా, ప్రేమ కలిగి సత్యమే పలుకుట, ప్రజలు మారుమనస్సు నొందునట్లు పాపమును బయటపెట్టుట గూర్చి మనము చెప్పుకొనుచున్నాము. మనము ఈ పని చేసినప్పుడు, మనము నిజముగా మన పరలోకపు తండ్రి వలె అగుచున్నవారమౌదుము.

క్రిస్ బుల్లార్డ్

---

సూచనలు

[1]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 326. [2]యెషయా 9:2; 60:1, 2; యోహాను 1:4–9; 3:19–21; 8:12; 9:5; 12:35–46; 1 యోహాను 1:5; 2:8. [3]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 338. [4]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament,* 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1991), 884, 904. [5]Lincoln, 328. [6]Zodhiates, 906. [7]Lincoln, 329. [8]Ibid., 330. [9]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:358. [10]Ibid., 360.

[11]Lincoln, 335. [12]దేవుని రక్షణ మరియు ఆయన తీర్పులకు సంబంధించిన పాత నిబంధన తారతమ్యముల కొరకు యెషయా 9:2; 10:17; 42:6, 7, 16; 47:5; 60:1–3 చూడుము. దేవుని శక్తి మరియు సాతాను శక్తి, మరియు దేవుని ప్రజలు మరియు ఆయన ప్రజలు కానివారికి సంబంధించిన క్రొత్త నిబంధన తారతమ్యముల కొరకు అపొస్తలుల కార్యములు 26:18; కొలొస్సయులకు 1:12, 13; 1 పేతురు 2:9, 10 చూడుము.